సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.33 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి. మార్కెట్‌కు 725 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5.50
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.5.50, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
41.7°/ 20.6°
జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.



నవ సమాజ నిర్మాత అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- ఆ మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో కలెక్టర్ అరుణ్ బాబు



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



డీపీఓలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాలకూ హక్కులు కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నవ సమాజ నిర్మాణానికి కృషి చేశారని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని 'స్పందన' హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో జన్మించిన అంబేడ్కర్ చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పాఠశాలలో వివక్షకు గురయ్యారని, అయినా పట్టుదలతో చదివి ప్రపంచం గర్వించదగ్గ మేధావిగా ఎదిగారన్నారు. చదువు అనే ఆయుధంతో సమాజంలోని ఎన్నో రుగ్మతలను రూపుమాపవచ్చని అంబేడ్కర్ నిరూపించారన్నారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా దేశాన్ని గౌరవించిన గొప్ప దేశ భక్తుడన్నారు. అలంకరించిన ప్రతి పదవికీ అంబేడ్కర్ వన్నె తెచ్చారన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న లక్ష్యంతో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య తదితర కార్యక్రమాను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివరంగ ప్రసాద్, ఆర్డీఓ భాగ్యరేఖ, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీలక్ష్మి, తిప్పన్న, బేకరి గంగాధర్, పైపల్లి నరసింహులు, రవి నాయక్, ఓబులేసు, వెంకటేసు, రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, భూగర్భజల శాఖ జిల్లా అధికారి రాజశేఖరరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, విద్యార్థులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి అంబేడ్కర్

కొత్తచెరువు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాలకూ హక్కులు ప్రసాదించిన మహోన్నత వ్యక్తి అన్నారు. అంబేడ్కర్ సమానత్వానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, రాజ్యాంగం ద్వారా మహిళలూ అన్ని రంగాల్లో రాణించేలా అవకాశాలు కల్పించారన్నారు. అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం డీఎస్పీ విజయ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రా రెడ్డి, ఆర్ఐ టాటాస్, శ్రీశైలం రెడ్డి, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పోలీసులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు 'గురుకుల' ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16న (ఆదివారం) పరీక్ష నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, బ్లూ పాయింట్ పెన్‌తో గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జగరాజుపల్లి హెల్త్ మేళాలో పాల్గొన్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో నిర్వహించిన హెల్త్‌మేళాను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, హెల్త్‌మేళాలో 12 రకాల ఆరోగ్యసేవలను అందించామన్నారు. బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలు వైద్య చికిత్సలు అందించడంతో పాటు చిన్న పిల్లలకు టీకాలు వేశామన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్, సీహెచ్‌ఓ నగేష్, సూపర్ వైజర్లు చంద్రకళ, వెంకటరమణ, సిబ్బంది అపర్ణ, రాజశేఖర్, ప్రమీళ, జ్యోతి తదితరులు ఉన్నారు.

17 నుంచి అండర్-14 క్రికెట్ క్యాంపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా మైదానం వేదికగా ఈ నెల 17 నుంచి అండర్-14 జాతీయ క్రికెట్ కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 11 వరకు క్యాంపు కొనసాగుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 25 మంది క్రీడాకారులు ఈ క్యాంపులో ప్రాతినిధ్యం వహించనున్నారు. క్యాంపు హెడ్ కోచ్‌గా రాకేష్ ధృవ్, సూరజ్‌యాదవ్ బౌలింగ్ కోచ్, బ్యాటింగ్ కోచ్‌గా వినిత్ ఇందుల్కర్, ఫీల్డింగ్ కోచ్‌గా సెబాస్టియన్ ఆంటోని, ఇతర కోచ్‌లను నియమించారు. వారి నేతృత్వంలో కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

- ఫ్రాన్స్ అగ్రికల్చర్ విద్యార్థుల కితాబు



ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న ఫ్రాన్స్ విద్యార్థులు

మడకశిర రూరల్: రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా రైతులు చేస్తున్న ప్రకృతి సాగు బాగుందంటూ విదేశీయులు కితాబు ఇచ్చారు. ఫ్రాన్స్ దేశంలో అగ్రికల్చర్ డిగ్రీ చదువుతున్న పలువురు విద్యార్థులు శుక్రవారం మడకశిర మండలంలోని మెళవాయి, సింగేపల్లి గ్రామాలను సందర్శించారు. పంటల సాగులో అవలంబిస్తున్న పద్ధతుల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్నట్లు తెలుసుకుని వాటి వివరాలు సేకరించారు. భూసార పరీక్షలు, పంట మార్పిడి, డ్రైసోయింగ్, జీవామృతం, బీజామృతం తయారీ పద్ధతుల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరో మూడు రోజుల పాటు మడకశిర మండలంలో పర్యటించి ఇక్కడ రైతులు అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అధ్యయన చేయనున్నట్లు ఫ్రాన్స్ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



పుట్టపర్తి విమానాశ్రయంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, రెవెన్యూ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డి తెలిపారు. ఈనెల 17న అనంతపురం జిల్లా నార్పల పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి గన్నవరం నుంచి విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నార్పల వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారలుతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఈనెల 17న అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పలలో నిర్వహిస్తున్న 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. అందులో భాగంగా సోమవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఉదయం 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. 10 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నార్పలకు చేరుకుంటారని వెల్లడించారు. అనంతరం 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమం ముగించుకొని మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారని, 1.40 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి వెళతారన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్లే వరకూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాటు చేయాలన్నారు. విమానాశ్రయంలో వైద్యులు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే సేఫ్ రూమ్, ఫైర్, ఫుడ్ సేఫ్టీపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కాన్వాయ్, రోప్ పార్టీ, బందోబస్తు, విమానాశ్రయ భద్రతపై పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, యశ్వంత్ కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సంజీవయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా రవాణా అధికారి కరుణసాగర్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర, డీపీఓ విజయకుమార్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. బహిరంగ సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవలని ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు సూచించారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమికి సూచించారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి నార్పలకు వెళ్లారు. సీఎం సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీలు రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష ఆదరణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చల్లా మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు శంకరనారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

- జేసీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి

పుట్టపర్తి: నాలుగేళ్లలో అమలైన సంక్షేమ పథకాలు వివరించి, ప్రజా మద్దతు కోరేందుకు చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని సచివాలయాల రీజినల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 7వ తేదీన కార్యక్రమం ప్రారంభం కాగా, లక్ష్యానికి చేరువుగా దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎక్కడికి వెళ్లినా.. ప్రజలు ఎదురొచ్చి ఇళ్లలోకి తీసుకెళుతూ తమకు వర్తించిన పథకాల గురించి ఆనందంగా చెబుతున్నారన్నారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, జిల్లా, మండలాల సచివాలయాల కన్వీనర్లతో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం చల్లా మధుసూదన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ నాటికి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం పూర్తి చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.

వారంలోనే 40 శాతం ఇళ్లు సందర్శించాం..

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ప్రారంభించి వారంరోజులు పూర్తి కాగా, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ఇప్పటికే 40 శాతం ఇళ్లు సందర్శించి ప్రజల కోరిక మేరకు 'నువ్వే మా నమ్మకం జగన్' స్టిక్కర్లు అతికించారన్నారు. మరో వారంరోజుల్లో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్తామని, ప్రతి కుటుంబం అభిప్రాయం తీసుకుంటామన్నారు. ఇక వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని టీడీపీ, ఇతర ప్రతి పక్షాలు చేస్తున్న కుట్రలను, కుతంత్రాలను పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాలని మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలపై రెఫరెండం

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ప్రజల్లోకి బాగా వెళ్లిందని, నాలుగేళ్లలో సీఎం జగన్ 90 శాతానికిపైగా ప్రజలకు ఏదో ఒక పథకం రూపంలో లబ్ధి చేకూర్చారని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పని తీరు, పథకాల అమలుకు రెఫరెండమ్‌గా ఆయన అభివర్ణించారు. సమావేశంలో జిల్లా సచివాలయాల ఇన్‌చార్జ్, రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ మెంబర్ జీను మహేశ్ బాబు, మండల సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నేతలు హాజరయ్యారు.

భద్రతకు ప్రాధాన్యం



ఎస్పీ మాధవరెడ్డి

- శాంతిభద్రతలకు విఘాతం కలగనివ్వం
- ఉల్లంఘనులు ఎవరైనా ఉపేక్షించం
- సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- బియ్యం, మద్యం అక్రమ రవాణా అడ్డుకుంటాం
- ఫ్యాక్షన్ గ్రామాలపై నిరంతర నిఘా
- మహిళలపై నేరాల నిరోధానికి చర్యలు
- 'సాక్షి'తో ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి



సాక్షి, పుట్టపర్తి: 'జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగు చర్యలు తీసుకుంటాం. నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదు. జిల్లాలో చాలా ప్రాంతాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. దీంతో రేషన్ బియ్యం తరలింపు, కర్ణాటక మద్యం దిగుమతి చేయడం పరిపాటిగా మారినట్లు తెలుస్తోంది. అయితే ఇక నుంచి ఎలాంటి నేరాలు జరగడానికి వీల్లేదు. సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఎన్నికలు సమీపస్తున్న తరుణంలో ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా మరింత పెంచుతాం. మహిళలపై జరిగే అఘాయిత్యాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తాం' అని శ్రీ సత్యసాయి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

నేర ప్రవృత్తి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి

నేర ప్రవృత్తి ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తాం. నేరస్తుల గురించి నేరుగా ఫిర్యాదు చేసేందుకు భయపడే వారు 'స్పందన' ద్వారా అర్జీ ఇచ్చి వెళ్లినా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతాం. నేరం చేసిన వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకుని తిరిగే అవకాశం ఇవ్వం. డయల్ 100పై మరింత అవగాహన పెంచుతాం.

కర్ణాటక మద్యం జిల్లాలోకి రానివ్వం

పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి చుక్క మద్యం కూడా జిల్లాలోకి రానివ్వం. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. అంతేకాకుండా జిల్లా నుంచి కర్ణాటకకు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పూర్తిగా చెక్ పెడతాం. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేశాం.

మహిళలపై దాడులు అరికడతాం

రెండేళ్ల వ్యవధిలో మహిళలు, చిన్నారులపై జరిగిన అఘాయిత్యాల సంఖ్య ఆధారంగా ఆయా ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తాం. మహిళలు, చిన్నారులపై దాడులను పూర్తిగా అరికడతాం. ఎక్కడైనా సంఘటన జరిగితే నిందితులపై కేసులు పెట్టి వీలైనంత త్వరగా విచారణ చేసి శిక్ష పడేలా కోర్టుకు పంపిస్తాం. 'దిశ' యాప్‌పై మరింత అవగాహన కల్పిస్తాం.

ఆన్‌లైన్ మోసాల నియంత్రణకు ప్రత్యేక విభాగం

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టులేక చాలా మంది అమాయకులు సైబర్ నేరాలకు బలవుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు ముఠాలుగా ఏర్పడి అమాయకులనే టార్గెట్ చేసి ఆన్‌లైన్ ద్వారా డబ్బు కాజేస్తున్నారు. అలాంటి వారిని పట్టుకునేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. చోరీలు జరగకుండా రాత్రిపూట గస్తీ నిర్వహణ పటిష్టం చేస్తాం.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా..

జిల్లా పరిధిలోని చాలా చోట్ల ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెప్పుకుంటాం. ఫ్యాక్షనిస్టుల కదలికలపై నిఘా ఉంచుతాం. దీనికి పోలీసులు తరచూ ఆయా గ్రామాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందిస్తాం. ఎన్నికలు సమీపిస్తుండటంతో శాంతిభద్రతలపై మరింత దృష్టి సారిస్తాం.

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం

ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'లో అందే ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రయతిస్తాం. ఓసారి వచ్చిన ఫిర్యాదు మరోసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సిబ్బంది కొరత లేకుండా చూస్తాం.

ఉద్యోగ ప్రస్థానం..

ఎస్పీ మాధవరెడ్డి 2010లో గ్రూప్–1 ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. తొలి పోస్టింగ్‌లో షాద్‌నగర్ డీఎస్పీగా, ఆ తర్వాత ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ డీఎస్పీగా పని చేశారు. అనంతరం రాష్ట్ర పునర్ విభజన తర్వాత ఏపీ గవర్నర్ పేషీలో పని చేశారు. అనంతరం కర్నూలు ఏఎస్పీగా పనిచేసి విజిలెన్స్ ఎస్పీగా పదోన్నతి పొంది గుంటూరులో పనిచేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు.

క్లుప్తంగా

అభివృద్ధికి సహకరించాలి



కలెక్టర్ అరుణ్‌బాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలోనే జిల్లా అంతా తిరుగుతానని పరిస్థితులు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఎస్పీని కలసిన ఎమ్మెల్యేలు



నూతన ఎస్పీ మాధవ రెడ్డిని కలసిన ఎమ్మెల్యేలు శ్రీధర్ రెడ్డి, శంకర్‌నారాయణ, సిద్ధారెడ్డిలు

కొత్తచెరువు: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మాధవరెడ్డిని శుక్రవారం పుట్టపర్తి, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, పీవీ సిద్ధారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్టీసీ బస్సు.. వరికోత మిషన్ ఢీ



ప్రమాదంలో నుజ్జు నుజ్జైన ఆర్టీసీ బస్సు ముందుభాగం

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సు, వరికోత మిషన్ ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో అనంతపురానికి వెళ్తోంది. అయితే కల్లూరు వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో కల్లూరు వైపుకు వెళ్లడానికి వరికోత మిషన్... బస్సుకు ఎదురుగా రావడంతో రెండు ఢీకొన్నారు. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అయితే ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వరికోత మిషన్ డ్రైవర్ సెలమ్ అర్షన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

విద్యా ప్రమాణాలు పాటించాల్సిందే

- నాణ్యతా ప్రమాణాలు పాటించని డిగ్రీ కళాశాలలపై చర్యలు
- గత ఏడాది 8 కళాశాలల గుర్తింపు రద్దు చేసిన ఎస్కేయూ
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో కాలేజీల నాణ్యతా ప్రమాణాల మదింపు
- నిజనిర్ధారణ కమిటీల సిఫార్సుల మేరకు 28 డిగ్రీ కళాశాలలకు షోకాజ్ నోటీసులు

నాణ్యతా ప్రమాణాలు తీసికట్టుగా ఉన్న డిగ్రీ కళాశాలలపై ఎస్కేయూ యాజమాన్యం చర్యలకు ఉపక్రమించింది. అర్హత కలిగిన అధ్యాపకులు, అవసరమైన మౌలిక వసతులు లేకపోయినా ధనార్జనే ధ్యేయంగా కొందరు కళాశాలలను నిర్వహిస్తున్నారు. నామమాత్రపు చదువులు చెప్పి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కళాశాలల ఆటకట్టించడమే లక్ష్యంగా యూనివర్సిటీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరిధిలో డిగ్రీ, బీఈడీ, పీజీ కళాశాలలు మొత్తం 90 ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలు మదింపు జరుగుతోంది. ఆన్‌లైన్ విధానంతో పాటు నేరుగా ఆయా కళాశాలలను నిజనిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ) పరిశీలించి.. బోధనా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధ్యయనం చేసింది. ఏ కళాశాలకు ఎన్ని సీట్లు కేటాయించాలనే అంశంపై నివేదిక రూపొందించి ఎస్కేయూ ఉన్నతాధికారులకు అందజేసింది. ఇందులో 28 డిగ్రీ కళాశాలల్లో సౌకర్యాలు లేవని నివేదిక ఇచ్చారు.

మూడు కేటగిరీలుగా విభజన

మౌలిక వసతులు, నాణ్యతా ప్రమాణాలను బట్టి కళాశాలలను మూడు కేటగిరీలుగా విభజించారు. అత్యున్నత ప్రమాణాలు ఉంటే తొలి కేటగిరీగా, ఒక మోస్తరులో ఉంటే రెండు, అధ్వానంగా ఉంటే మూడో కేటగిరీగా ఉన్నత విద్యా మండలి నిర్దేశించింది. జిల్లాలో తొలి కేటగిరీలో ఒక్క కళాశాల కూడా లేదని నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. రెండో కేటగిరీలోకి 82 డిగ్రీ కళాశాలలు, మూడో కేటగిరిలో 8 డిగ్రీ కళాశాలలను చేర్చింది. ఈ 8 డిగ్రీ కళాశాలల్లో గత విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లను నిరాకరించారు. వీటికి గుర్తింపు రద్దు చేశారు.

- తాజాగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలలకు గుర్తిపు ఇవ్వడానికి ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందుకోసం నిజనిర్ధారణ కమిటీ ఆయా కళాశాలల స్థితిగతులను అంచనావేసింది. రెండో కేటగిరీలోని 82 డిగ్రీ కళాశాలల్లో ఏకంగా 28 డిగ్రీ కళాశాలలకు గుర్తింపు ఇవ్వకూడదని తేల్చింది. వీటికి త్వరలోనే నోటీసులు జారీ చేసి నిర్దేశించిన ప్రమాణాలు పెంపొందించుకోవడానికి నిర్ణీత గడువు ఇవ్వనుంది. ఆ గడువులోపు స్పందించకపోతే కళాశాల గుర్తింపు రద్దు చేయనున్నారు.
- ఇది వరకు మూడు నెలల్లోపు నిర్దేశిత ప్రమాణాలు పెంపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తాజాగా స్వల్ప వ్యవధి గడువు మాత్రమే ఇవ్వనున్నారు. 30 శాతం లోపు ఫ్యాకల్టీ కొరత ఉండకూడదు. 30 శాతంలోపు భవనాలు ఉండరాదు. రిజిస్ట్రేషన్ కాని భూమి ఉండరాదు. లీజు డాక్యుమెంట్లు, సొసైటీ పేరుతో టైటిల్ డీడ్ ఉంటే చెల్లదు. కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో కళాశాల ఉండకూడదు. గడిచిన మూడేళ్లలో 25 శాతంలోపు అడ్మిషన్లు ఉండకూడదు. ఇలాంటి లోపాలు ఉంటే కళాశాలకు గుర్తింపు ఇవ్వరు.



ఎస్కేయూ పాలక భవనం

పాలక మండలి నిర్ణయం మేరకే..



నాణ్యమైన విద్య అందితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందనే ఉద్దేశంతో సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. అన్ని కళాశాలల్లో నిజనిర్ధారణ కమిటీలు పరిశీలించి నివేదిక అందజేశాయి. ఈ వివరాలు పాలకమండలి ఆమోదం మేరకు ఎన్ని డిగ్రీ కళాశాలలకు అనుమతి వస్తుందనే అంశంపై స్పష్టత వస్తుంది.

–ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

బిడ్డలకు మనమిచ్చే నిజమైన ఆస్తి విద్యనే



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన అణగారిన వర్గాలకు అత్యున్నత విద్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే నెరవేరుతోందని ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఎంఈఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌జేడీ మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అన్ని రకాల అత్యుత్తమ అవకాశాలు, సమాజంలో గౌరవం సమాన స్థాయిలో కల్పించినప్పుడే అంబేడ్కర్‌కు మనం ఇచ్చే గౌరవమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం విద్యను అభ్యసించాలన్నది అంబేడ్కర్ ఆశయమన్నారు. అప్పట్లో ఆయన ఆశయం నెరవేరలేదన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో అది నెరవేరుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తోందన్నారు. పేద ప్రజలు చదువుకొనే పాఠశాలలను నాడు–నేడు పేరుతో ఎంతో అభివృద్ధి చేస్తూనే విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి, విదేశీ విద్యతో సమూల మార్పులు చేస్తున్నారని కొనియాడారు. వెనుకబడిన వర్గాలకు మనం ఇచ్చే ఆస్తి చదువేనన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, ఏడీ రామకృష్ణ, ఎంఈఓ వెంకటరమణనాయక్, అసోషియేషన్ నాయకులు సుధాకర్‌నాయక్, గోపాల్‌నాయక్, గురుప్రసాద్, సాల్మన్‌రాజ్, ఓబుళపతి, జిల్లా యూనియన్ నాయకులు పీవీ రమణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుజాత, శమంతకమణి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శ్రీరాములు

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామానికి చెందిన శ్రీరాములు (28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంజినప్ప కుమారుడు శ్రీరాములు గత కొంత కాలంగా ఉద్యోగంతో పాటు వివాహం చేసుకునేందుకు ప్రయత్నం చేశారు. వివాహంతో పాటు ఉద్యోగం కూడా దక్కకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని పై కప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రేమ విఫలం కావడంతోనే శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఫుట్ గ్రిల్‌లో వృద్ధురాలి కాలు

- అవస్థలుపడి తీసిన స్థానికులు



ఫుట్ గ్రిల్‌లో కాలు ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలు ఇందిరమ్మ

పుట్లూరు: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు మారింది ఓ వృద్ధురాలి పరిస్థితి. మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ అనే వృద్ధురాలు బీపీ నివారణ మందుల కోసం శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. వైద్య పరీక్షలు చేయించుకుని బయటకు వస్తున్న సమయంలో గేటు వద్ద ఉండే ఫుట్ గ్రిల్‌లో ఆమె కాలు ఇరుక్కుపోయింది. వృద్ధురాలు ఇందిరమ్మ పరిస్థితిని గమనించిన స్థానిక మహిళలు కాలును బయటకు తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కొబ్బెర నూనెను కాలుకు రాయగా కాలు బయటకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి–అనంతపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల వివరాల మేరకు .. మృతుడి వయస్సు సుమారు (35) సంవత్సరాలు ఉంటుందని, మృతుడు బ్లూకలర్ టీషర్ట్, పాచీ రంగు ఉన్న ప్యాంటు ధరించినట్లు చెప్పారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో రైలు దిగి నడుచుకుంటూ వచ్చి బ్రిడ్జి వద్ద మృతి చెందినట్లు అక్కడున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానవ సేవే మాధవసేవ

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

గోరంట్ల: మానవసేవే మాధవసేవని, ప్రతి ఒక్కరు సేవగుణం అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గోరంట్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దాతల సహకారంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం, డెడ్ ఫ్రీజర్లను జాతికి అంకితం చేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దాతలు ముందుకు వచ్చి గోరంట్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వైకుంఠ రథం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకంతో పాటు 108 సేవలు తీసుకొచ్చి ఎందరో ప్రాణాలు కాపాడరన్నారు. ఆయన అడుగు జాడల్లో ఆయన తనయుడు, సీఎం జగన్ పేదల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ తీసుకొచ్చారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి వైకుంట రథాన్ని జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు పాలేజ యరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనికి వెళ్తే... పచ్చ కండువా వేశారు!

- కొండకింద తండావాసుల ఆవేదన



కొండకింద తండావాసులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: కూలి పని కోసం అనంతపురం వెళ్లిన తమను మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి మభ్యపెట్టి పచ్చ కండువా వేసి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకున్నారని కొండకిందతండా వాసులు అన్నారు. తండాకు చెందిన నరసింహులునాయక్, ఎం.బొజ్జేనాయక్, కె.దివాకర్‌నాయక్ శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిసి తాము టీడీపీలో చేరలేదని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ కార్యక్రమం గురువారం అనంతపురంలో జరిగిందన్నారు. అక్కడ ఏర్పాట్ల కోసం కూలి పనికి తమను పిలుచుకుని వెళ్లారన్నారు. ఫంక్షన్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే రఘునాథరెడ్డి... తాము వారిస్తున్నా వినకుండా ఉన్నఫళంగా తమకు టీడీపీ కండువాలు కప్పి నిమిషాల్లో ఫొటోలు కూడా తీయించుకుని తాము టీడీపీలో చేరినట్లు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేం ఎప్పటికీ వైఎస్సార్ సీపీ కార్యకర్తలమే..

తన తండ్రి రవినాయక్ అనారోగ్యంతో మృతిచెందగా వైఎస్సార్ బీమా కింద ఈ ప్రభుత్వం రూ.7 లక్షలు సాయం అందించిందని దివాకర్‌నాయక్ తెలిపారు. అలాగే తనకు వృద్ధాప్య పింఛన్, మాటలు రాని తన భార్య శాంతమ్మకు దివ్యాంగుల కోటాలో పింఛన్ ఇచ్చి ఆదుకొంటోందన్నారు. తాము ఎందుకు పార్టీ మారతామని నరసింహులు నాయక్ ప్రశ్నించారు. తాము ఎప్పటికీ వైఎస్సార్ సీపీ కార్యకర్తలమేనన్నారు. అనంతరం వారి కోరిక మేరకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేశారు. మాజీ ఎమ్మెల్యే పల్లె ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పారకల రమణ, సచివాలయాల మండల కన్వీనర్ ఏ.గంగిరెడ్డి, నాయకులు మంగేనాయక్, గోపేనాయక్, నరసింహులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కలసికట్టుగా కృషి చేయాలని ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న ఆర్‌ఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీపీటీఓ మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబా సాహెబ్ అంబేడ్కర్ విశిష్టత, గొప్పదనాన్ని, దళిత వర్గాలకు అభున్నతికి చేసిన కృషి, రాజ్యాంగ రచనకు వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం దేశానికి ఒక రక్షణ కవచం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం ఇనయతుల్లా, ఉద్యోగులు ఉషారాణి, పార్థసారధిరెడ్డి, ఖాజావళి, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉన్న స్థానిక ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. విధి నిర్వహణలో అగ్ని ప్రమాదంలో అమరవీరులైన మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబైలో జరిగిన అగ్నిప్రమాదంలో 700 మంది మృత్యువాత పడ్డారని, ఇందులో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అప్పటినుంచి విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ అగ్నిమాపక వారోత్సవాలను జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు ప్రజలకు అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఓలు, నాగరాజునాయక్, హేమంత్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సాధిక్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగి బాలుడి మృతి

గుంతకల్లు రూరల్: చెరువులో నీట మునిగి సురేంద్ర (8) అనే బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం నాగసముద్రం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. నాగసముద్రం గ్రామానికి చెందిన దాసరి శివ అనే వ్యక్తి యాడికి మండలం, ఓబుళాపురం గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 6న నాగసముద్రం గ్రామంలో జరిగిన కదిరప్ప స్వామి రథోత్సవానికి శివ భార్య చెల్లెలు అయిన జయలక్ష్మి, ఆమె భర్త సుంకన్న తమ కుమారుడు సురేంద్రతో కలిసి వచ్చారు. రథోత్సవం అనంతరం తిరిగి వెళ్లిన జయలక్ష్మి, సుంకన్నలు తమ కుమారుడు సురేంద్రను మాత్రం నాగసముద్రం లోనే వదిలి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలిసి గ్రామంలోని చెరువు వద్దకు ఈతకు వెళ్లిన సురేంద్ర ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. తోటి స్నేహితులు కూడా విషయాన్ని గమనించలేకపోయారు. అదే సమయంలో ఎద్దులకు నీళ్ల తాపేందుకు వచ్చిన ఒక రైతు నీటిలో దిగగానే నీట మునిగిన సురేంద్ర అతడి కాళ్లకు తగలడంతో ఆ రైతు వెంటనే నీటిలో మునిగిపోయిన సురేంద్రను బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

సాయి కీర్తనం.. భక్తి పరవశం

- వైభవంగా తమిళ నూతన సంవత్సర వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



సంగీత కచేరీ నిర్వహించిన సుందర భజన బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామస్మరణతో ప్రశాంతి నిలయం పులకించి పోయింది. తమిళ నూతన సంవత్సర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. వేలాది మంది తమిళనాడు భక్తులు ప్రశాంతి నిలయం చేరుకుని వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధిని తమిళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో అలంకరించారు. అనంతరం తమిళ భక్తుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యసాయిని కీర్తిస్తూ సుందరం బృందం సభ్యులు నిర్వహించిన కచేరీ అలరించింది. సాయంత్రం తిరుచి బ్రదర్స్ కృష్ణ మోహన్, రామమోహన్‌ల సంగీత కచేరి నిర్వహించగా, భక్తులు తన్మయత్వం చెందారు.